రాజన్న ఆలయం ముందు భాగంలో భక్తులు

## ఎములాడ రాజన్నకు శ్రావణ శోభ

వేములవాడ టౌన్, ఆగస్టు11: శ్రావణ మాసం అందులో ఆదివారం సెలవుదినం కావడం తో వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయం భక్తులతో రద్దీగా కనిపించింది. వేకువజామునే భక్తులు స్వామివారి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఆలయంలో క్యూలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు కోడెమొక్కు తీర్చుకున్నారు. రాజన్నను దాదాపు 25 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని,సుమారు రూ.23 లక్షలకు పైగా ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. సోమవారం దర్శనం కోసం భక్తులు తరలివస్తున్నారు.

సత్రంలో భక్తులతో మాట్లాడి ఆహార నాణ్యతను అడిగి తెలుసుకుంటున్న ఈవో

### అన్నదాన సత్రాన్ని తనిఖీ చేసిన ఈవో

వేములవాడ టౌన్, ఆగస్టు11 : రాజన్న భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అన్నదాన సత్రాన్ని ఆదివారం ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదంగా అందించే వంట కాలను పరిశీలించారు. అనంతరం భక్తులను ఆహారం నాణ్యత గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు రుచికరమైన ఆహార ప్రసాదాన్ని అందించాలని నిత్యాన్నదాన సత్రం ఇన్‌చార్జికి సూచించారు. వీరి వెంట ఆలయ ఉద్యోగులు ఎన్.రాజేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

## అంతర్గతంగా ఉద్యోగుల బదిలీ ప్రక్షాళన

- రాజన్న ఆలయంలో రికార్డు అసిస్టెంట్ నుంచి ఏఈవో వరకు బదిలీలు
- పలువురికి అదనపు బాధ్యతలు

వేములవాడ, ఆగస్టు 11: రాష్ట్ర వ్యాప్త దేవాదాయశాఖ ఉద్యోగ బదిలీల నేపథ్యంలో రాజన్న ఆలయంలోనూ అంతర్గత బదిలీ ప్రక్షాళన జరిగింది. ఆలయానికి బదిలీపై వచ్చిన ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. ప్రధానంగా ఏఈవో, ఆరుగురు పాత పర్యవేక్షకులకు పూర్తిగా శాఖలు మార్చగా, మరికొందరికి అదనపు బాధ్యతలు ఇస్తూ ఈవో వినోద్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రికార్డ్ అసిస్టెంట్ నుంచి ఏఈవో వరకు బదిలీ ప్రక్షాళన జరగడం ఆలయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

### ఏఈవోల శాఖలు ఇవే..

రాజన్న ఆలయంలో ఏఈవోలకు శాఖలు కేటాయించారు. జయకుమారికి రాజన్న నిత్యాన్నదాన సత్రం ట్రస్టు, అకౌంట్స్, ఈపీఎఫ్, శానిటేషన్, ఆలయ వెబ్ సైట్, టీ యాప్, ఈ టికెట్, బంగారం, వెండి విలువైన వస్తువులు, జీఎస్టీ ఇన్‌కామ్ టాక్స్, సంస్కృత పాఠశాలలు, వసతి గృహాలు, వేద పాఠశాల భారత్ గ్యాస్ ఏజెన్సీస్ బాధ్యతలు అప్పగించారు. బ్రహ్మన్నగారి శ్రీనివాస్‌కు గతంలో ఉన్న ప్రధాన దేవాలయం, శానిటరీ, ప్రసాదం కౌంటర్లలతోపాటు అనుబంధ ఆలయాలు, ఆలయ భద్రత ఎస్‌పీఎఫ్ హోంగార్డ్, సెక్యూరిటీ, కల్యాణ కట్ట ధర్మగుండం బాధ్యతలు అప్పగించారు. యాదగిరి గుట్ట నుంచి బదిలీపై వచ్చిన శ్రవణ్‌కుమార్‌కు ఆలయ పరిపాలన, ఆడిట్, లీజులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, కరీంనగర్ కల్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్, ప్రసాదాల తయారీ విభాగం బాధ్యతలు కేటాయించారు. అలాగే రమేశ్ బాబుకు వసతి సముదాయాలు, పీఆర్వో విభాగం, పార్కింగ్‌లో శానిటేషన్, ధర్మప్రచార రథం, హౌస్ కీపింగ్, శానిటేషన్, వసతి గదులు ఇతర ప్రాంతాల బాధ్యతలు అప్పగించారు.

### టికెట్ బుకింగ్ కౌంటర్లకు ప్రత్యేకాధికారి

ఆలయంలో ఆరుగురు పాత పర్యవేక్షకుల విధుల్లో స్వల్ప మార్పులు చేయగా, కొత్తగా వచ్చిన వారికి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఆలయంలో టికెట్ బుకింగ్ కౌంటర్ల తనిఖీకి పర్యవేక్షకురాలు శ్రీలతను నియమించడం ఆలయంలో చర్చనీయాంశంగా మారింది.

### రికార్డు అసిస్టెంట్ నుంచి ఏఈవో వరకు బదిలీ

ఆలయంలో రికార్డ్ అసిస్టెంట్ నుంచి మొదలుకొని ఏఈవో వరకు బదిలీలు కొనసాగాయి. సీనియర్ అసిస్టెంట్ నుంచి మొదలుకొని జూనియర్ అసిస్టెంట్ల వరకు శాఖలు కేటాయిస్తూ బాధ్యతలు అప్పగించారు. గతంలో పని చేస్తున్న రికార్డు అసిస్టెంట్లకు కూడా బాధ్యతలు అప్పగించి బదిలీ చేశారు. ఆలయ అంతర్గత బదిలీలు కూడా అదే స్థాయిలో జరిగాయని ఆలయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

## నీటితో కళ కళ లాడుతున్న ఎస్సారార్ జలాశయం

బోయినపల్లి, ఆగస్టు 11: బోయినపల్లి మండలం మాన్వాడ ఎస్సారార్ జలాశయం నీటితో కళకళలాడుతోంది. ఆదివారం రిజర్వాయర్‌లో 16.80 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరద కాలువ ద్వారా జలాశయానికి 3,150 ఇన్‌ఫ్లో వస్తుండగా 6,462 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో వెళ్తున్నట్లు వారు తెలిపారు. జలాశయం సామర్థ్యం 27.54 టీఎంసీల నీటి నిలువకు గాను ప్రస్తుతం 16.80 టీఎంసీల నీటి నిలువ ఉన్నట్లు వారు వెల్లడించారు.

### అన్నపూర్ణకు కొనసాగుతున్న కాళేశ్వరం జలాలు

ఇల్లంతకుంట, ఆగస్టు 11 : మండలంలోని అనంతగిరి గ్రామ శివారులోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు కాళేశ్వరం జలాలు ఆదివారం బాహుబలి మోటర్ల ద్వారా రోజుకు 6,440 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నట్లు ఏఈ సమరసేన తెలిపారు. రాజరాజేశ్వర (మధ్య మానేరు) ప్రాజెక్టు నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా తిప్పాపూర్ పంప్‌హౌస్‌లోకి గోదావరి జలాలు రాగా బాహుబలి మోటర్ల ద్వారా అన్నపూర్ణలోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టులో 1.25 టీఎంసీ నీరు నిలువ ఉండగా సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేశారు.



నీటితో కళకళలాడుతున్న మాన్వాడ ఎస్సారార్ జలాశయం